సాక్షి ఖమ్మం

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



బీఆర్‌ఎస్ సత్తా చాటుతాం

ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభతో సత్తా చాటుతామని పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు అన్నారు. IIలో



మేమిక ఉండలేం..

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ శాఖలో ఆరేళ్లుగా బదిలీలు లేకపోవటంతో సిబ్బంది ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. IIలో

గరిష్టం / కనిష్టం
39° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. రాత్రి వరకూ వేడి వాతావరణంతో పాటు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పలువురు న్యాయాధికారుల బదిలీ

ఖమ్మం లీగల్ : జిల్లాలో పలువురు న్యాయాధికారులు బదిలీ అయ్యారు. ఖమ్మం అబ్కారీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాళ్లబండి శాంతిలత వికారాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా, మధిర ఒకటో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డి వనపర్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. సత్తుపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆయేషా హుజూర్‌నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వెళ్లగా, ఆ స్థానంలో మిర్యాలగూడ నుంచి బి. సాయినాగ సుమబాల వస్తున్నారు, మధిర ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి వేముల దీప్తి రానున్నారు. ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

జిల్లా జడ్జికి తీర్మాన పత్రాలు..

ఇటీవల విజయవాడలో 'స్వతంత్ర న్యాయవ్యవస్థ–బాధ్యత' అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆమోదించిన తీర్మానపత్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు తెలంగాణ రాష్ట్ర న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు హర్కారా శ్రీరాంరావు, సుగ్గల వెంకటగుప్త, శేషాద్రి శిరోమణి, నరేష్, కిషోర్‌బాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు

ఖమ్మంక్రైం: తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశానికి ఈనెల 27 పరీక్ష జరగనున్న నేపథ్యాన కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమల్లో ఉంటుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపుగా ఉండొద్దని, సమీప ప్రాంతాల్లో సభలు, సమావేశాలు, మైకులు, డీజేలతో ఊరేగింపులకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. అంతేకాక సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్‌షాపులు, స్టేషనరీ షాపులు మూసివేయాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలుఅతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

రైతులు ఇబ్బంది పడకుండా చూడాలి : సీపీ



రైతులతో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

నేలకొండపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు.మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం రాజేశ్వరపురంలోని అరుణాచల రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు, రవాణా, కాంటాలు, బిల్లులు తదితర అంశాలపై రైతులతో మాట్లాడారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని మిల్లర్లకు సూచించారు. ఆయన వెంట కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్సై సంతోష్ ఉన్నారు.

రైతులు నష్టపోకుండా చూస్తాం

ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి



వైఎస్ బంజర్‌లో పామాయిల్ తోటను పరిశీలిస్తున్న రాఘవరెడ్డి తదితరులు

వేంసూరు: పామాయిల్ సాగులో ఆఫ్ టైప్ మొక్కల నివారణ చర్యలు చేపట్టి రైతులకు నష్టం కలుగకుండా చర్యలు చేపడతామని ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని వైఎస్‌బంజర్, ఎర్రగుంటపాడు, చోడవరం గ్రామాల్లో శుక్రవారం ఆయన పామాయిల్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆఫ్ టైప్ మొక్కలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, పామాయిల్ సాగుపై ఆసక్తి కోల్పోతున్నారని, దీనిపై నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకంపై సరైన చర్యలు చేపట్టకపోవడంతోనే నాణ్యత లేని మొక్కలు వచ్చి ఉంటాయని అన్నారు. లోపాలను అధిగమించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చీడపీడల బెడద తక్కువగా ఉండడంతో పాటు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొంటుందని, కోతల బెడద ఉండదని, ప్రస్తుత పరిస్థితుల్లో పామాయిల్ సాగే లాభదాయకమని వివరించారు. ఈ పంట సాగులో జిల్లా రైతులు ముందంజలో ఉన్నారని, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని అనుసరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ శాస్త్రవేత్త బీఎస్ రావు, ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్ రెడ్డి, డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, అశ్వారావు పేట, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కళ్యాణ్, ఆయిల్ పామ్ రైతు సంఘం నాయకులు ఉమామహేశ్వరరెడ్డి, గొర్ల రాంమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు కొర్రీలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఆశతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుందామని వచ్చిన రైతులకు పడిగాపులు తప్పడం లేదు. క్వింటాకు 3 నుంచి 5 కేజీల తరుగు తీస్తామని మిల్లర్లు, లారీలు వస్తేనే కాంటాలు వేస్తామని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, లోడింగ్, అన్‌లోడింగ్ వెంటనే చేస్తేనే లారీలు పెడతామంటూ సరఫరాదారులు, క్వింటాకు రూ.65 ఇవ్వాలని హమాలీలు పెడుతున్న కొర్రీలతో అన్నదాతలు విలవిల్లాడుతున్నారు. ఈ కష్టాలు చాలవన్నట్టు అకాల వర్షాలతో కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవుతోంది. దీంతో కొందరు రైతులు ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేందుకు ముందుకొస్తున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



పెనుబల్లి కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

ప్రభుత్వ కేంద్రాల్లోనే రైతుల పడిగాపులు

- క్వింటాకు 5 కేజీల తరుగు తీస్తామంటున్న మిల్లర్లు
- లారీలు లేకుండా కాంటా వేయలేమంటున్న నిర్వాహకులు
- అకాల వర్షాలతో తడిసిన ధాన్యం
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు

పెరిగిన ఖర్చులు..

సన్నధాన్యం పండిస్తే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో యాసంగిలోనూ పలువురు రైతులు ఆ ధాన్యాన్నే సాగు చేశారు. అయితే చివరిలో వచ్చిన అకాల వర్షాలు వారిని దెబ్బతీశాయి. మొదట పంట బాగానే ఉన్నా.. కోత దశలో వచ్చిన వర్షం నష్టాన్ని చేకూర్చింది. ధాన్యాన్ని టైర్ల మిషన్‌తో కోస్తే ఎకరానికి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు ఖర్చవుతుంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలతో టైర్ మిషన్లతో కోయడం కష్టంగా మారడంతో ట్రాక్ మిషన్లను ఉపయోగించాల్సి వచ్చింది. దీంతో ఎకరానికి రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఖర్చయింది. దీనికి తోడు కొన్ని కేంద్రాల్లో ధాన్యంపై కప్పుకోవడానికి టార్పాలిన్లు కూడా రైతులే కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇలా రైతులపై అదనపు భారం పడింది.

అమ్ముదామంటే అవస్థలు..

జిల్లాలో 351 కొనుగోలు కేంద్రాలు తెరవగా.. 184 కేంద్రాల్లో కొద్దో గొప్పో కొనుగోళ్లు సాగుతున్నాయి. ఆయా కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. క్వింటాకు 3 నుంచి 5 కేజీల తరుగు తీయకపోతే దిగుమతి చేసుకోమంటూ మిల్లర్లు చెబుతున్నారు. ధాన్యం తేమ శాతం నిబంధనలకు లోబడే ఉందని, ఇతర ఖర్చులు కూడా తామే భరిస్తున్నామని, మళ్లీ తరుగు ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తరుగు తీసేందుకు ససేమిరా అంటున్నారు. ఇక లోడింగ్‌కు లారీలు రాకపోవడంతో ధాన్యం కాంటా వేసేందుకు నిర్వాహకులు ఒప్పుకోవడం లేదు. వెంటనే లోడింగ్, అన్‌లోడ్ అయితేనే లారీలు పెడతామని సరఫరాదారులు చెబుతున్నారు. తరుగు తీయకపోవడంతో మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదు.

తడుస్తున్న ధాన్యం..

రోజుల తరబడి కేంద్రాల్లో ధాన్యం ఆరబోసి ఉండగా.. ఇటీవల పలుమార్లు అకాల వర్షం కురిసింది. టార్పాలిన్లు వేసినా.. కింద నుంచి నీరు రావడం, కొన్ని కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం తడిసింది. దీంతో చాలామంది రైతులు మళ్లీ కూలీలను పెట్టి తిరగేయించారు. ఇలా తడవడం, తూర్పార పట్టించడం, ఆరబోయడంతోనే సరిపోతుండగా మారుతున్న వాతావరణంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక కొన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సౌకర్యాలు ఉండడం లేదు. కనీసం రైతులకు తాగు నీరు కూడా అందుబాటులో లేదు.

కేంద్రాల వద్ద పడిగాపులు..

రైతులు గత 10, 15 రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. విపరీతమైన ఎండలతో అలసిపోతున్నారు. ఉక్కపోతతో తట్టుకోలేకపోతున్నామని, కాంటాలు వేయడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇక హమాలీలకు క్వింటాకు రూ.65 ముట్టజెప్పాల్సి వస్తోందని, తూర్పార పడితే రూ.200 వరకు ఖర్చవుతోందని చెబుతున్నారు. కొందరు రైతులు వేచి ఉండలేక ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అయితే వారు క్వింటా రూ.2,100కే అడుగుతున్నా.. ఇతర ఖర్చులు, ఇబ్బందులు ఉండవనే కారణంతో వారికే అమ్ముతున్నామని చెబుతున్నారు.

వివరాలు..

జిల్లాలో మొత్తం కొనుగోలు కేంద్రాలు	351
కొనుగోళ్లు సాగుతున్నవి	184
కొనుగోలు చేసిన ధాన్యం	29,695.200 మెట్రిక్ టన్నులు
ధాన్యం విక్రయించిన రైతులు	3,578
మిల్లులకు తరలించిన ధాన్యం	29,695.200 మెట్రిక్ టన్నులు

ధాన్యం కొనుగోలు చేయడం లేదు



నేను పదెకరాల్లో వరి సాగు చేశా. 500 బస్తాల దిగుబడి వచ్చింది. ధాన్యం అమ్మేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే 12 రోజులైనా కొనుగోలు చేయలేదు. ఇప్పటికే వర్షంతో ధాన్యం ఒకసారి తడిస్తే కూలీలను పెట్టి తిరగేయించా. అడిగితే రేపు, మాపు అంటున్నారు. బోనస్ వస్తుందని కేంద్రానికి తీసుకొస్తే ఇలా ఇబ్బంది పెడుతున్నారు.

– కొప్పుల శ్రీనివాసరెడ్డి, బీరోలు, తిరుమలాయపాలెం మండలం

ఏం చేయాలో అర్థం కావట్లే..



సన్నరకం ధాన్యం అమ్ముకునేందుకు ఐకేపీ కొనుగోలు కేంద్రానికి వారం క్రితం తరలించా. తేమ 16 శాతం ఉంది. సన్నధాన్యం కావడంతో బోనస్ వస్తుందని తెచ్చా. ఇక్కడ టార్పాలిన్‌లు లేవు. వాతావరణం గంటకో తీరుగా మారుతోంది. ఎప్పుడు వర్షం వస్తుందోనని భయమేస్తోంది. కాంటాలు మాత్రం వేయడం లేదు. ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముదామంటే క్వింటా రూ.1500కే అడుగుతున్నారు.

– చిల్లపల్లి లక్ష్మణ, పెనుబల్లి

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు



ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోండి

- కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో ఐదు డీఏలు పెండింగ్‌లోనా ?
- టీజీఈజేఏసీ ఛైర్మన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి



మాట్లాడుతున్న ఏలూరి శ్రీనివాసరావు, పక్కన మారం జగదీశ్వర్ తదితరులు

ఖమ్మం సహకారనగర్ : కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో ఉద్యోగులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, వారి సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని టీజీఈజేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు కోరారు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఖమ్మంలోని టీఎన్జీఓస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. 95 శాతం మంది ఉద్యోగులు జీతంపైనే ఆధారపడి ఉంటారని అన్నారు. బకాయి బిల్లులు నెలకు రూ.650 కోట్ల చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. హెల్త్ కార్డులపై పలుమార్లు ఆరోగ్య శాఖ మంత్రిని కలిసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పీఆర్సీ నివేదికను తక్షణమే అమలు చేయాలని, వేతనాల సవరణకు 50 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న వైద్య బిల్లులను క్లియర్ చేయడంతో పాటు క్యాష్‌లెస్ హెల్త్‌కార్డులు అందించాలన్నారు. జీపీఎఫ్ రుణాలను వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్ బకాయిల విడుదలతో పాటు సరెండర్ లీవ్‌లు క్లియర్ చేయాలని కోరారు. ఉద్యోగులు బాగుంటేనే ప్రజా సంక్షేమ పథకాలు అమలుచేయడంలో చురుగ్గా పాల్గొంటారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైనా మంత్రుల పేషీల్లో ఉద్యోగ సంఘ నాయకులను గుర్తించడం లేదని ఆరోపించారు. మే 4న రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కో ఛైర్మన్ మన్నెబోయిన తిరుపతి, జిల్లా టీజేఏసీ ఛైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, కన్వీనర్ కస్తాల సత్యనారాయణ, వివిధ సంఘాల నాయకులు యలమద్ది వెంకటేశ్వర్లు, పారుపల్లి నాగేశ్వరరావు, దేవరకొండ సైదులు, తుంబూరి సునీల్ రెడ్డి, మామునూరి రాజేష్, విజయ్, ఎ.వి నాగేశ్వరరావు, వీరస్వామి, కొణిదెన శ్రీనివాస్, మోదుగు వేలాద్రి, మల్లెల రవీంద్రప్రసాద్, కళ్యాణం కృష్ణయ్య, పరిస పుల్లయ్య, ఎం.సుబ్బయ్య, డాక్టర్ బాబు రత్నాకర్ పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టరేట్ నుంచి టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది.

తొలిరోజే పుస్తకం.. పాఠం

- జిల్లాకు చేరుతున్న పాఠ్యపుస్తకాలు
- ఇప్పటికే గోదాంలకు చేరిన 2,11,610 పుస్తకాలు



గోదాంకు చేరిన పాఠ్యపుస్తకాలు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ముందుచూపుతో వ్యవహరిస్తోంది. ఈ విద్యా సంవత్సరం ముగియకముందే వచ్చే ఏడాదికి (2025–26) అవసరమైన పాఠ్య పుస్తకాలను అందుబాటులో ఉంచుతోంది. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు సిద్ధమవుతోంది. 2025 – 26 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉండగా తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలలు 1,303 ఉండగా వాటిలో 87,809 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరికీ అవసరమైన పాఠ్య పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు చేరుస్తోంది. జిల్లాలోని పాఠశాలల్లో 6,59,570 పాఠ్య పుస్తకాలు అవసరం ఉండగా.. 2,11,610 పాఠ్య పుస్తకాలు ఇప్పటికే వచ్చాయి. మిగతావి త్వరలో రానున్నాయి. అన్నీ రాగానే ఎంఈఓ కార్యాలయాలకు తరలించి, అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పుస్తకాల్లోకి కొత్త అంశాలు..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెలంగాణ తల్లి విగ్రహం, రాష్ట్ర గీతంలో స్వల్ప మార్పులు చేసింది. వీటిపై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేలా వచ్చే విద్యా సంవత్సరంలో అందించే పాఠ్య పుస్తకాల్లో వీటిని పొందుపరుస్తున్నారు. అలాగే ఈ సారి రాజ్యాంగ పీఠికను సైతం ముద్రించారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా..

పాఠశాలల పునః ప్రారంభం రోజునే విద్యార్థులకు పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇది ఎంతగానో ఉపయోగకరమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గతంలో మన ఊరు మన బడి, మన బస్తీ మన బడి, ఆ తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న క్రమంలో పుస్తకాలు కూడా సకాలంలో అందితే విద్యార్థులు తొలినాళ్ల నుంచే చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంది.

పుస్తకాలు వస్తున్నాయి



జిల్లాకు పాఠ్య పుస్తకాలు వస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకుంటాం. ప్రారంభం నుంచే పాఠ్య పుస్తకాలు అందించడం ద్వారా పిల్లలకు చదువుపై మరింత శ్రద్ధ పెరిగే అవకాశం ఉంది. – ఈ.సోమశేఖర శర్మ, డీఈఓ

కదం తొక్కిన విద్యార్థులు



ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు, నాయకులు

- ఖమ్మంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- నగరంలో భారీ ప్రదర్శన



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను, పక్కన మాదాల రవి తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్ : ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఖమ్మం వీధుల్లో విద్యార్థులు శుక్రవారం కదం తొక్కుతూ ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని జెడ్పీసెంటర్ వద్ద ప్రముఖ విద్యావేత్త మువ్వా శ్రీనివాసరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించగా వైరా రోడ్ మీదుగా భక్త రామదాసు కళాక్షేత్రానికి చేరుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. ఎస్‌ఎఫ్‌ఐ జెండాలు, భగత్ సింగ్, చేగువేరా ప్లకార్డులు, కోలాటం, డప్పు నృత్యాలతో సాగిన ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం సభ ప్రారంభానికి ముందు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు మూర్తి జెండా ఆవిష్కరించగా.. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు.

హెచ్‌సీయూ భూముల రక్షణపై పోరాటం..

రాష్ట్రంలోని హెచ్‌సీయూ భూముల రక్షణపై ఎస్‌ఎఫ్‌ఐ పోరాడిందని, దీంతో సంఘ నేతలపై పలు కేసులు నమోదు చేశారని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ అధ్యక్షుడు వీపీ సాను అన్నారు. దేశంలో అనేక యూనివర్సిటీల్లో విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న తమ సంఘం నేతలపై కేసులు పెడుతున్నారని చెప్పారు. హిందూ, హిందుస్థానీ అంటూ కేంద్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాల్లో మార్పులు తీసుకొస్తోందని, బీజేపీకి, మోడీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని విద్యాలయాల నుంచి సస్పెండ్ చేస్తోందని ఆరోపించారు. సినీ నటుడు, నిర్మాత మాదాల రవి మాట్లాడుతూ.. పోరాటాలకు చైతన్యమే ఏకైక మార్గమని అన్నారు. అభ్యుదయ శక్తులు, వామపక్షాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. పోరాటాల ఖిల్లా ఖమ్మం జిల్లాకు రెడ్ సెల్యూట్ అంటూ ఉపన్యాసాన్ని ప్రారంభించిన ఆయన.. 'చదువెందుకు.. చదువెందుకురా.. నలుగురిలో దీపమై నిలిచేందుకు రా' అంటూ విద్యార్థులను ఉర్రూతలూగించారు. దాస్య శృంఖలాల నుంచి దేశానికి విముక్తి కల్పించిన భగత్ సింగ్, ప్రపంచ విప్లవాన్ని ముందుకు నడిపిన చేగువేరా.. బడుగు జీవుల కోసం పాటుపడిన అంబేద్కర్ నిజమైన హీరోలని వ్యాఖ్యానించారు. సమాజ ధోరణిలో ఎస్‌ఎఫ్‌ఐ మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘం వైస్ ఛైర్మన్ ఐవీ రమణారావు, రిసెప్షన్ కమిటీ గౌరవాధ్యక్షుడు రవిమారుత్, ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ ఎం.పూజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, తుడుం ప్రవీణ్ పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఖరారు

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు జరిగే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఖరారు చేసినట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 23, ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో 21 శిబిరాలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. బోనకల్, ముదిగొండ, వి.వి.పాలెం, తనికెళ్ల, కొదుమూరు, కుంచపర్తి, కల్లూరు, మధిర, ఖమ్మం రూరల్, కామేపల్లి, తిరుమలాయపాలెం, వైరా, రఘునాథపాలెం, తిమ్మారావుపేట కేంద్రాల్లో బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, నెట్‌బాల్, లాన్‌టెన్నిస్ తదితర క్రీడాంశాల్లో శిబిరాలు ఉంటాయని వివరించారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో అథ్లెటిక్స్, క్రికెట్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, రోలర్ స్కేటింగ్, ఉషు, టెన్నిస్, స్విమ్మింగ్, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, ఖో–ఖో, నెట్‌బాల్, హ్యాండ్‌బాల్, కరాటే క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

'స్ఫూర్తి' సేవలు ప్రశంసనీయం

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



చెక్కు అందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్ : విద్యారంగంలో స్ఫూర్తి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కామేపల్లికి చెందిన పేద విద్యార్థి తేజావత్ శ్రీనివాస్‌కు ఫౌండేషన్ అందించిన రూ.50వేల చెక్కును శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..కాన్పూర్ ఐఐటీలో శ్రీనివాస్ అడ్మిషన్ పొందగా, ఆర్థిక పరిస్థితి బాగా లేనందున ఆ కోర్సు చదివే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఈ క్రమంలో అతడి తల్లిదండ్రులు ఇటీవల కలెక్టరేట్‌లో ప్రజావాణిలో అధికారులకు విన్నవించారని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆ విద్యార్థికి ఆర్థిక సాయం బాధ్యతను విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్‌కు అప్పగించారని తెలిపారు. దీంతో ఆయన సూచన మేరకు స్ఫూర్తి ఫౌండేషన్ వారు ఐఐటీ చదువుకు అయ్యే ఖర్చంతా భరిస్తామని ముందుకొచ్చారని, ఈ మేరకు సంస్థ అధికార ప్రతినిధి వరక రామారావు తొలివిడతగా రూ. 50 వేల చెక్కు ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ వలంటీర్లు ఉబ్బన బాబురావు, జల్లి రామకృష్ణ, బైర్ల వెంకటేశ్వర్లు, శిరసాని ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేతనం సకాలంలో చెల్లించాల్సిందే..



బల్లార్షాకు వెళ్లిన తర్వాత వలస కూలీలు పంపిన ఫొటో

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాకు వలస వచ్చి పనులు చేసిన కూలీల కష్టార్జితాన్ని సకాలంలో చెల్లించాలని యజమానులకు జిల్లా ఉప కార్మిక కమిషనర్ కె.విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లాలోని మధిర మండలం వంగవీడు గ్రామంలో మిర్చి తోటలో పని చేసేందుకు మహారాష్ట్రలోని బల్లార్షా ప్రాంతం నుంచి 10 మంది వలస కూలీలను యజమానులు తీసుకొచ్చారని, కిలో మిర్చికి రూ.30 చెల్లిస్తామని నిర్ణయించారని, మిర్చి కోసినందుకు కూలీ రూ.1,14,210లు కాగా.. యజమాని వలస కూలీలకు రూ.5 వేలు మాత్రమే చెల్లించారని పేర్కొన్నారు. మిగిలిన కూలీ ఇవ్వకపోవడంతో వలస కూలీలు కార్మికశాఖ అధికారులను సంప్రదించారని, అధికారులు ఈ నెల 24న కూలీలకు ఆ కూలీ మొత్తం ఇప్పించి, వారిని జీటీ ఎక్స్‌ప్రెస్ ద్వారా బల్లార్షాకు సురక్షితంగా పంపించామని విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక డంప్‌ల సీజ్



ఇసుక డంపులను సీజ్ చేస్తున్న తహసీల్దార్

తిరుమలాయపాలెం: మండలంలోని బాలాజీ నగర్‌తండా గ్రామ పంచాయతీ పరిధిలోని రమణాతండాలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను మండల తహసీల్దార్ సుధీర్, పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. మొత్తం 50 ట్రిప్పుల ఇసుక ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రంగారెడ్డి ఆర్‌ఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉషూ జట్ల ఎంపిక



జిల్లా ఉషూ జట్లు

ఖమ్మంస్పోర్ట్స్: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ పోటీల్లో జిల్లా జట్లను జిల్లా ఉషూ సంఘం ప్రకటించింది. క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, ఉషూ కోచ్ పి.పరిపూర్ణాచారి కోరారు.

సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలి..



మాట్లాడుతున్న తిరుపతి

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చి ప్రభుత్వ ఆధీనంలోనే విద్యారంగం కొనసాగేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య లభిస్తుందని నమ్మకం కలిగించేలా ప్రభుత్వ విధానాల్లో మార్పులు తీసుకురావాలని, విద్యారంగంలో ప్రైవేటీకరణను నియంత్రించాలని, ప్రతి గ్రామంలో ఒకటే బడి అదే ప్రభుత్వ బడి ఉండేలా కామన్ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వై.పద్మ, రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి మాట్లాడారు. సమావేశంలో వెంగళరావు, కె.వెంకటేశ్వరరావు, వీరబాబు, ముత్తయ్య, నాగిరెడ్డి, ఉమాదేవి, నాగేశ్వరరావు, యాకూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,200	5,700
కందులు	6,500	6,500
మిర్చి	13,500	6,000
మిర్చి తాలు	5,700	4,500
పత్తి	7,650	5,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.21,000

రజతోత్సవ సభకు ఇలా వెళ్లొద్దాం..


బీఆర్‌ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. ● జనం కోసం సకల వసతులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక

జోన్-1 వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు
రూట్ : మల్లంపల్లి–గుడెప్పాడ్ –వంగపహాడ్– యూ టర్న్ ఎన్‌హెచ్ 163–హసన్‌పర్తి –ఎల్కతుర్తి

జోన్-2 ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర
రూట్ : ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు–నాయుడు పెట్రోల్ పంప్–టయోటా షోరూం–కడిపికొండ బ్రిడ్జి–మడికొండ–ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు –టోల్‌గేట్–దేవన్నపేట–మడిపల్లి–అనంతసాగర్, కరుణాపురం –ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్–దేవన్నపేట –మడిపల్లి–అనంతసాగర్–పార్కింగ్

జోన్-3 జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్
రూట్ : ధర్మసాగర్–దేవునూరు –దామెర–చింతలపల్లి–పార్కింగ్

జోన్-4 ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)
రూట్ : కరీంనగర్, హుజూరాబాద్–కోతులనడుమ–గ్రానైట్ రోడ్డు పార్కింగ్

జోన్-5 ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్
రూట్ : సిద్దిపేట–ముల్కనూరు–ఇందిరా నగర్ పార్కింగ్

సభ వివరాలు



మొత్తం సేకరించిన భూమి : **1,356** ఎకరాలు

సభావేదిక : **159** ఎకరాలు

- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

రజతోత్సవ సభతో బీఆర్‌ఎస్ సత్తా చాటుతాం

ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మధు, పక్కన మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, కందాళ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభతో పార్టీ సత్తా చాటుతామని, ఈ సభకు హాజరయ్యేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ప్రతీ జిల్లా నుంచి 30 వేల మంది రావాలని సూచించగా, ఇప్పటికే 40 వేల మంది సిద్ధమయ్యారని తెలిపారు. ఖమ్మంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ బిడ్డల ఆకాంక్ష మేరకు రాష్ట్ర ఏర్పాటు సాధనే లక్ష్యంగా కేసీఆర్ చూపిన పోరాట పటిమ మరువరానిదని అన్నారు. అంతేకాక పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ అనేక పథకాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. కాగా, గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీలు నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టినా.. 16 నెలల పాలనలోనే ఆ పార్టీపై తీవ్ర వ్యతిరేకత పెరిగిందన్నారు. ఈ నేపథ్యాన ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించే సభలో భవిష్యత్ కార్యాచరణపై కేసీఆర్ దిశానిర్దేశం చేయబోతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు తరలివెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని వెల్లడించిన మధు, వెంకటవీరయ్య ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమవగా.. కాంగ్రెస్ నాయకులే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు నడుపుతూ తప్పుడు పద్ధతుల్లో రాజకీయ ప్రేరేపిత కార్యక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, కొండబాల కోటేశ్వరరావు, బానోత్ చంద్రావతి, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు వరప్రసాద్, కర్నాటి కృష్ణ, మక్బూల్, ఉప్పల వెంకటరమణ, బెల్లం వేణుగోపాల్, భాషబోయిన వీరన్న, వేముల వీరయ్య, తాజుద్దీన్, బిచ్చాల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత పహెల్గాం మృతులకు సంతాపంగా మౌనం పాటించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. శ్రీకనక దుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం జరిపారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఈఓ రజనీకుమారి, భక్తులు పాల్గొన్నారు.

నేడు శనీశ్వరునికి తైలాభిషేకం

పెద్దమ్మగుడి సముదాయంలోని శివాలయంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం శనీశ్వరుడికి తైలాభిషేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

రవాణాశాఖ కార్యాలయంలో ఏసీబీ కలకలం

పెట్టర్లకు తాళాలు వేసి కనిపించకుండా వెళ్లిన ఏజెంట్లు



ఏజెంట్ల దుకాణాలకు తాళాలు వేసి ఉన్న దృశ్యం

ఖమ్మంక్రైం: జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఏసీబీ కలకలం సృష్టించింది. మహబూబాబాద్ ఎంవీఐగా పనిచేస్తూ ఏసీబీకి చిక్కి సస్పెండ్‌లో ఉన్న గౌస్‌పాషాకు చెందిన ఖమ్మంలోని ఇంట్లో అధికారులు సోదా చేశారు. రవాణాశాఖ కార్యాలయానికి కూడా వారు వస్తున్నారనే సమాచారం వైరల్ కావటంతో ఒక్కసారిగా కలకలం రేగింది. గౌస్‌పాషా గతంలో ఖమ్మంలో ఎంవీఐగా, ఇన్‌చార్జ్ ఆర్‌టీఓగా కూడా పనిచేశారు. దీంతో ఆయన పనిచేసిన కాలంలో ఫైళ్లను తనిఖీ చేస్తారని పుకార్లు రావటంతో రవాణాశాఖ కార్యాలయంలో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ గడిపారు. కార్యాలయంలో ఏజెంట్లను ఎవరినీ అనుమతించలేదు. చుట్టు పక్కల ఉన్న దుకాణాల షెట్టర్లకు తాళాలు వేసిన ఏజెంట్లు శుక్రవారం కనిపించకుండా పోయారు. వారిని ఆశ్రయించిన వాహనదారులు లైసెన్స్‌లు, ఆర్‌సీల కోసం ఏజెంట్లను చెట్ల కింద, ఆ ప్రాంతంలో ఉన్న ఇతర దుకాణాల వద్ద పట్టుకుని తమ పని చేయించుకున్నారు. అయితే, బైపాస్‌రోడ్డులోని విజయ్‌నగర్‌కాలనీలో గౌస్‌పాషా ఒక గది మాత్రమే అద్దెకు తీసుకున్నారని, అందులో ఎలాంటి ఆధారాలు ఏసీబీకి లభించలేదని తెలిసింది.

రిజిస్ట్రేషన్ లేకుండా ఆస్పత్రులు నడపొద్దు



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ లేకుండా నడిపితే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు, ఎన్‌వీబీడీసీపీ పీఓ వెంకటరమణతో కలిసి శుక్రవారం సురక్ష ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఓపీ, ఐపీ రిజిస్టర్లు చెక్ చేసి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం అపరేషన్ థియేటర్, వార్డులను పరిశీలించారు. పేషెంట్లకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో సిబ్బంది వివరాలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని ఆదేశించారు. తాను మళ్లీ తనిఖీకి వచ్చేనాటికి అన్ని విభాగాలు, రిజిస్టర్లు, ల్యాబ్ పద్ధతి ప్రకారం ఉంచాలని, లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో సాంబశివారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సొసైటీ డైరెక్టర్ మృతి

కామేపల్లి: రోడ్డు ప్రమాదంలో కామేపల్లి పీఏసీఎస్ సొసైటీ డైరెక్టర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. జాస్తిపల్లి గ్రామానికి చెందిన దేవండ్ల యాదగిరి (53) శుక్రవారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లి పని ముగిసిన తరువాత తన మోటార్ సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ముచ్చర్ల రైతువేదిక సమీపంలో మద్దులపల్లి గ్రామానికి చెందిన రెల్లా గోపాల్‌రెడ్డి తన మోటార్ సైకిల్‌తో వేగంగా దూసుకొచ్చి యాదగిరి బైక్‌ను ఢీకొట్టాడు. యాదగిరి తలకు తీవ్ర గాయం కాగా.. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి సోదరుడు నారాయణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ



సీసీ ఫుటేజీలో నిందితుడు

వైరా: స్థానిక వాసవీ కల్యాణ మండపం సమీపంలో శుక్రవారం సాయంత్రం ఓ మహిళ మెడలో నుంచి బంగారపు గొలుసును దుండగుడు చోరీ చేశాడు. పోలీసులు, బాధిత మహిళ కథనం ప్రకారం.. వైరాకు చెందిన మిట్టపల్లి వెంకటలక్ష్మి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ద్విచక్రవాహనంపై హెల్మెట్, మాస్క్ ధరించి అతివేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని యువకుడు మహిళ మెడలో నుంచి మూడున్నర తులాల బంగారపు గొలుసును లాక్కొని వెళ్లాడు. మహిళ కేకలు వేయగా స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఏసీపీ రెహమాన్ కల్యాణ మండపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ద్విచక్రవాహనానికి నంబర్ ప్లేట్ లేకపోవడం, చెయిన్ స్నాచర్ షార్ట్ మీద ఉన్నట్లు గుర్తించారు. 25 ఏళ్ల లోపు వయసు ఉంటుందని అంచనా వేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ఖమ్మం వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

స్వర్ణ కవచధారణలో రామయ్య



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్య కల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భూమి రాసిస్తేనే పెళ్లి

తాళి కట్టే సమయాన నిలిచిన వివాహం

కూసుమంచి: తనకు కట్నంగా ఇస్తానన్న భూమిని బాండ్ పేపర్‌పై రాసిస్తేనే తాళి కడతానని వరుడు పట్టుబడటంతో పీటలమీద పెళ్లి నిలిచిపోయిన ఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన యువకుడికి వెంకట్రాంపురం గ్రామానికి చెందిన తన బంధువుల యువతితో వివాహం నిశ్చయమైంది. బుధవారం ఏపీలోని ఓ దేవాలయంలో వివాహం జరిపించేందుకు వెళ్లారు. వరుడు తాళికట్టే సమయాన తనకు కట్నంగా ఇస్తానన్న భూమిని ఇప్పుడే బాండ్ పేపర్‌పై రాసి ఇవ్వాలని, అలా అయితేనే తాళి కడతానని పట్టుబట్టాడు. ఇరు వర్గాల వాగ్వాదం అనంతరం వరుడు కల్యాణ మండపం నుంచి వెళ్లిపోయాడు. దీంతో చేసేదేమీ లేక వధువు తరఫువారు అక్కడి స్థానిక పోలీసులను ఆశ్రయించగా వారి సూచనతో గురువారం కూసుమంచి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఇరువర్గాలను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్

అక్కడికక్కడే యువకుడు మృతి

నేలకొండపల్లి: ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ ఢీకొట్టటంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కోనాయిగూడెం శివారులో రహదారి పక్కన ఆగి ఉన్న టిప్పర్ బైక్ ఢీకొట్టింది. గుర్తు తెలియని యువకుడు (28) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేశారు.

మేమిక ఉండలేం..

- బదిలీల కోసం ఎక్సైజ్ ఉద్యోగుల ఎదురుచూపులు
- ఆరేళ్లుగా 180 మందికి స్థానచలనం లేదు..
- దూర ప్రాంతాల ఉద్యోగుల్లో ఆవేదన



ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఎక్సైజ్ శాఖలో ఆరేళ్లుగా బదిలీలు జరగకపోవటంతో సిబ్బంది ఎప్పుడెప్పుడా అని ఆశతో ఎదురుచూస్తున్నారు. ఈ నెలలో అయిపోతుంది, వచ్చే నెలలో అయిపోతుంది అంటూ కాలం వెళ్లదీస్తున్నారు తప్ప బదిలీల గురించి పట్టించుకోనే పరిస్థితి లేదు.

సీఐ మొదలు కానిస్టేబుళ్లు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1, ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్–2, నేలకొండపల్లి, వైరా, మధిర, సత్తుపల్లి, సింగరేణి మొత్తం 7 ఎక్సైజ్ స్టేషన్‌లు ఉండగా, భద్రాద్రి కొత్తగూడెంలో కొత్తగూడెం, అశ్వారావుపేట, పాల్వంచ, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు కలిపి 6 స్టేషన్‌లు ఉన్నాయి. దీనికి తోడు రెండు డీటీఎఫ్ (డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్)లు, ఒక ఎన్‌ఫోర్స్‌మెంట్ స్టేషన్‌లు ఉన్నాయి. వీటిలో పని చేస్తున్న 180 మంది సిబ్బంది ఆరేళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు ఉండగా 37 మంది హెడ్‌కానిస్టేబుళ్లు 140 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్–2 ఒకప్పుడు బూర్గంపాడు ఎక్సైజ్ స్టేషన్ కాగా ముంపు మండలాలు అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో కలపటంతో ఆ స్టేషన్‌ను అక్కడి నుంచి ఖమ్మం తరలించి ఎక్సైజ్‌స్టేషన్–2గా మార్చారు. అయితే దాదాపు పదేళ్లు కావొస్తున్నా ఈ స్టేషన్‌లో 8 మందికి పైగా సిబ్బంది అప్పటి నుంచి ఇక్కడే పని చేస్తుండటం గమనార్హం. ఏళ్ల తరబడి అవే స్టేషన్లలో పనిచేస్తుండటంతో సిబ్బందిపై సైతం పలు ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు ఎంతోకాలంగా ఏజెన్సీ ప్రాంతాలు, దూరప్రాంతాల్లో పనిచేస్తున్న సిబ్బంది సైతం ఈ స్టేషన్లలో ఎంతకాలం పనిచేయాలనే ధోరణితో నిరాశ చెందుతున్నారు.

త్వరలోనే పక్రియ..?

గతంలో మాదిరిగా ఈసారి బదిలీల ప్రక్రియకు బ్రేక్ పడే అవకాశం లేదని దాదాపు బదిలీలు జరగటం ఖాయమని కొందరు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ చివరి వారం లేదా, మే మొదటివారంలో బదిలీలు జరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ రాష్ట్ర ఉన్నతాధికారి విదేశాల్లో ఉండటంతో ఆయన తిరిగి రాగానే వెంటనే రాష్ట్రవ్యాప్తంగా బదిలీల ప్రక్రియ ఉంటుందని చెబుతున్నారు, వచ్చే నెల వరకు బదిలీ పక్రియ జరిగితే తమ పిల్లల విద్యాభ్యాసానికి ఇబ్బంది ఉండదని ఆలస్యం అయితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని సిబ్బంది చెబుతున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ముదిగొండ: జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వల్లభిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కోమటి వెంకటేశ్వర్లు (62) భార్య, కుమార్తె కోవిడ్ సమయంలో మృతిచెందారు. అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది దూలానికి లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ముదిగొండ సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి..

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరికి చెందిన చింతకాయల నవీన్ (27) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. నవీన్ ట్రాక్టర్‌డ్రైవర్‌గా పనిచేస్తూ.. డ్రోన్‌తో మందులు పిచికారీ చేస్తుంటాడు. ఆయా వృత్తుల్లో తీవ్ర నష్టం రావడంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజు వెల్లడించారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్

అక్కడికక్కడే యువకుడు మృతి

నేలకొండపల్లి: ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ ఢీకొట్టటంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కోనాయిగూడెం శివారులో రహదారి పక్కన ఆగి ఉన్న టిప్పర్ బైక్ ఢీకొట్టింది. గుర్తు తెలియని యువకుడు (28) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి, కేసు నమోదు చేశారు.

మన శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో కంటికి కూడా అంతే అవసరం. రోజూ కొద్ది సేపు ఈ కంటి వ్యాయామాలు చెయ్యడం వలన కంటి చూపు వృద్ధి చెందుతుంది. దీనికి ప్రత్యేకంగా సమయం కేటాయించవలసిన అవసరం లేదు. ఎప్పుడు.. ఎక్కడ... ఎలా వీలయితే అలా సులువుగా చేసుకోవచ్చు. ఏం లేదు... పైకి, కిందికీ, పక్కలకూ కళ్ళను కదుపుతూ కొంతసేపు కంటి వ్యాయామాలు చేస్తే సరిపోతుంది.

అలాగే కంటికి మంచి చేసే ఆహారం కూడా ఉంది. ఆకుకూరల్లో కరివేపాకు, పొన్నగంటి, మెంతికూర, తోటకూర కంటిచూపును కాపాడుకోవడానికి దోహదం చేస్తాయి. పండ్లలో



కంటికి ఆహారం... వ్యాయామం

బొప్పాయి, మామిడి, ఉసిరి మంచిది. అలాగే క్యారట్, కోడిగుడ్డు, పాలు కంటికి మేలు చేస్తాయి.

20-20-20

ఎక్కువగా కంప్యూటర్ ముందు పని చేసేవారికి కళ్లు బాగా అలసటకు గురవుతాయి. అలాంటివారు ఈ 20-20-20 రూల్ ని పాటించాలి. అది వెరీ సింపుల్. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి బ్రేక్ తీసుకుని కంప్యూటర్‌ని కాకుండా 20 మీటర్ల దూరంలో ఉన్న ఏదైనా వస్తువుని 20 సెకన్ల పాటు చూడండి. ఇదే 20-20-20 రూల్. అలాగే కంప్యూటర్ స్క్రీన్ నుంచి వచ్చే బ్లూ లైట్ వల్ల కళ్ళు దెబ్బతినకుండా ఉండడం కోసం యాంటీ గ్లేర్ గ్లాసెస్‌ను ఉపయోగించండి.

ఇంతవరకూ ఏ సమస్యలూ లేకపోతే ఏడాదికి కనీసం ఒక్కసారైనా కంటిపరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటికే కళ్లజోడు వాడుతున్నవారయితే ఏడాదికి రెండు సార్లు విధిగా కంటిపరీక్షలు చేయించుకోవడం మంచిది.

పైన చెప్పిన జాగ్రత్తలు పాటిస్తూ, మంచి ఆహారం తీసుకోవడం వల్ల కంటి వ్యాధులు ఉన్నవారికి కొంతవరకు ఉపశమనం లభిస్తుంది. ఏ వ్యాధీ లేనివారు భవిష్యత్తులో కంటి జబ్బులు రాకుండా కాపాడుకోవచ్చు.

పారేయకండి... పదును పెట్టండి



వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, న్యూస్ పేపర్లు, పనికిరాని ఇతర గృహోపకరణాలను బుర్రకు కాస్త పదును పెడితే చాలు... కళాఖండాలుగా తయారు చేయచ్చు. ఈ వేసవి సెలవల్లో పిల్లలకు దీనిపై కాస్తంత ఐడియా ఇస్తే చాలు... ఆనక వాళ్లే అల్లుకు పోతారు. వీటితో సృజనాత్మకత పెరగడమే కాదు.. కుదురు వస్తుంది. పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతెలుస్తుంది. వనరుల పరిరక్షణ, రీసైక్లింగ్ ప్రాముఖ్యత తెలిసొస్తాయి. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ఒక సారి వాడి పడేసే కార్టన్‌లను ఆహ్లాదకరమైన జంతువుల ఆకారాలుగా మార్చవచ్చు. ఇది పిల్లల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంచడానికి దోహదపడుతుంది. ఇందుకోసం పిల్లలను వారికి ఇష్టమైన జంతువు లేదా పక్షుల గురించి అడిగి, వాటి ఆకారాలను కాగితంపై ఔట్‌లైన్ గీయడం ద్వారా ప్రారంభించవచ్చు.

కావలసినవి: ఖాళీ కార్టన్లు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, గమ్, గూగ్లీ కళ్ళు, పైప్ క్లీనర్లు.

ఆలోచనకు తగ్గట్టు కార్టన్‌ను వివిధ ఆకారాలుగా కత్తిరించుకుని వారికి ఇష్టమైన రంగులలో పెయింట్ చేయనివ్వండి. రంగులు కలిపి నమూనాలను రూపొందించడానికి వారికే అవకాశం ఇవ్వడం మంచిది.

అలంకరణ: రంగు ఆరిన తర్వాత, గూగ్లీ కళ్ళపై జిగురు వేయండి. మార్కర్ల సాయంతో ముఖంలో ఇతర భాగాలను లేదా నమూనాలను గీయండి. పైప్ క్లీనర్‌లతో కాళ్ళు, యాంటెన్నా లేదా తోకలుగా చేసి చిన్న రంధ్రాలు చేసి దారంతో అటాచ్ చేయండి.





టాయిలెట్ పేపర్ రోల్ బైనాక్యులర్లు.. ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్‌ను బైనాక్యులర్‌లుగా మార్చుకోండి,

కావలసినవి: రెండు ఖాళీ టాయిలెట్ పేపర్ రోల్స్, నూలు లేదా రిబ్బన్, యాక్రిలిక్ పెయింట్ బ్రష్‌లు, గమ్, స్టిక్కర్లు, డెకరేషన్లు.

పెయింటింగ్: పిల్లలను టాయిలెట్ పేపర్ రోల్స్‌కు పెయింట్ వేయమని చెప్పి, వాటిని పూర్తిగా ఆరిన తర్వాత పక్కపక్కనే అతికించండి. గ్లూ గట్టి పడగానే మెడ పట్టీకోసం రెండువైపులా నూలు లేదా రిబ్బన్‌ముక్కను అటాచ్ చేయండి. వీటికి స్టిక్కర్లు, మార్కర్లు, ఇతర అలంకరణలతో డెకరేట్ చేయండి. అలా తయారైన బైనాక్యులర్లతో సరదాగా బయటి ప్రదేశాలను చూడమని చెప్పండి.

బాటిల్ క్యాప్ అయస్కాంతాలు...

పాత బాటిల్ మూతలను అయస్కాంతాలుగా మార్చండి. వీటితో మీ రెఫ్రిజిరేటర్‌ను అందంగా అలంకరించండి.

కావలసినవి: మెటల్ బాటిల్ మూతలు, చిన్న గుండ్రని అయస్కాంతాలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, పూసలు, బటన్లు, సీక్విన్, గ్లూ

తయారీ: బాటిల్ మూత లోపల, వెలుపల బ్రైట్ కలర్స్ తో పెయింట్ చేయండి.ఆరిన తర్వాత క్యాప్‌ల లోపల చిన్న పూసలు, బటన్లు లేదా గవ్వలను అతికించండి. గ్లూ లేదా మంచి గమ్‌తో ప్రతి బాటిల్ మూత వెనుక భాగంలో ఒక చిన్న గుండ్రని అయస్కాంతాన్ని అటాచ్ చేయండి. ఇలా తయారైన వాటితో రిఫ్రిజిరేటర్‌పై కళాకృతులు, నోటీసులు లేదా ఫోటోలను ప్రదర్శించండి.



ప్లాస్టిక్ బాటిల్ ప్లాంటర్లు...

ప్లాస్టిక్ బాటిళ్లను అందమైన ప్లాంటర్‌లుగా తిరిగి ఉపయోగించవచ్చు, పిల్లలకు రీసైక్లింగ్, తోటపని నేర్పచ్చు.

కావలసినవి: ఖాళీ ప్లాస్టిక్ సీసాలు, కత్తెర, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్‌లు, మట్టి, చిన్న మొక్కలు లేదా విత్తనాలు.

తయారీ: ప్లాస్టిక్ బాటిళ్లను సగానికి కట్ చేసి, పైభాగాన్ని పారవేయండి. సీసాల దిగువ భాగాలను రంగులతో అలంకరించండి. ఇలా అలంకరించిన సీసాలను మట్టితో నింపి వాటిలో విత్తనాలు లేదా చిన్న మొక్కలను నాటండి. వీటిని ఎండ పడే ప్రదేశంలో ఉంచి, రోజూ నీరు పెట్టండి.

వార్తాపత్రిక కోల్లేజ్ కళ...

పాత వార్తాపత్రికలను కథను చెప్పే అద్భుతమైన కొల్లేజ్ కళాఖండాలుగా మార్చండి

కావలసినవి: పాత వార్తాపత్రికలు, కత్తెర గ్లూ స్టిక్, కాగితం లేదా కాన్వాస్, మార్కర్లు

తయారీ: వార్తాపత్రికల నుంచి ఆసక్తికరమైన చిత్రాలు, ముఖ్యాంశాలు, ఇతర న్యూస్‌ను కత్తిరించండి. కొల్లేజ్ సృష్టించడానికి కటౌట్ లను కాగితం లేదా కాన్వాస్‌పై అమర్చండి. విభిన్న లే ఔట్‌లు, థీమ్‌లతో ప్రయోగం చేయండి. తర్వాత, ఈ ముక్కలను అతికించండి. మార్కర్‌లు లేదా రంగు పెన్సిళ్లతో కొల్లేజ్‌కు నేపథ్యాలను జోడించండి. ఇలా తయారైన కోల్లెజ్‌ను కనిపించేలా వేలాడదీయండి.



సీడీ సన్ క్యాచర్లు...

పాత సీడీలకు మిరుమిట్లు గొలిపే సన్ క్యాచర్లుగా కొత్త జీవం పోయవచ్చు.

కావలసినవి: పాత సీడీలు, యాక్రిలిక్ పెయింట్స్, బ్రష్లు, క్రాఫ్ట్ జిగురు, స్ట్రింగ్ లేదా రిబ్బన్, పూసలు, ఇతర డెకరేషన్‌లు.

తయారీ: రంగురంగుల డిజైన్లు, నమూనాలు లేదా అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌తో సీడీలు మెరిసే వైపు పెయింట్ చేయండి. అంచుల చుట్టూ లేదా మధ్యలో పూసలతో అలంకరించి వాటిని సీడీ మధ్యలో ఉన్న రంధ్రం ద్వారా దారంతో అతికించండి. వీటిని ఎండ పడే కిటికీలో వేలాడదీస్తే అందమైన కాంతులు వెదజల్లుతాయి.

న్యూస్ పేపర్లతో ఫోటో ఫ్రేమ్...

కొన్ని పాత న్యూస్‌పేపర్లను తీసుకొని ప్రతి షీట్‌ను ముక్కలుగా చింపివేయండి. ఇప్పుడు, వార్తాపత్రికను ఒక మూల నుండి చుట్టడం ద్వారా సన్నని రోల్స్ తయారు చేయండి. రోల్‌ను భద్రపరచడానికి వార్తాపత్రిక అంచుని అతికించండి.

ఇప్పుడు మీకు కావలసిన ఏ పరిమాణంలోనైనా కార్డ్ బోర్డ్ ముక్కను తీసుకోండి. మీరు ఫ్రేమ్ చేయాలనుకుంటున్న ఛాయాచిత్రాన్ని ఫ్రేమ్ మధ్యలో ఉంచి, దాని రూపురేఖలను గీయండి. వార్తాపత్రిక రోల్స్‌ను అవుట్‌లైన్‌లపై అతికిస్తూ నాలుగు వైపులా కవర్ చేయండి. అదనపు వార్తాపత్రికను కత్తిరించండి. ఫ్రేమ్‌కు మీకు నచ్చిన ఏ రంగునైనా పెయింట్ చేసి ఫోటోగ్రాఫ్‌ను అతికిస్తే సరి.. మీ ఫోటో ఫ్రేమ్ రెడీ!

పిల్లల చేత ఇలాంటి వాటిని తయారు చేయిస్తే వారికి మంచి కాలక్షేపం అవుతుంది.



పాత ప్లాస్టిక్ సీసాలు, మెటల్ సీసా మూతలు, పెరుగు కుండలు, స్ట్రాలు, ప్యాకేజింగ్ వంటి శుభ్రమైన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించండి. తర్వాత, ఇంట్లో 'రీసైకిల్డ్ ఆర్ట్ స్టేషన్'ని సృష్టించండి. జిగురు, మార్కర్లు, పెయింట్, కత్తెర, ఇతర క్రాఫ్టింగ్ మెటీరియల్‌ను ఇచ్చి, పిల్లలకు ఒక సవాలు ఇవ్వండి, వారు ప్లాస్టిక్ బాటిల్‌ను బర్డ్ ఫీడర్‌గా మార్చగలరా? ఆ పెరుగు కుండ పూల కుండగా మారగలదా? లేదా ప్లాస్టిక్ మూతలన్నీ కలబబోసుకుని రోబోట్ శిల్పంగా మారతాయేమో చూద్దాం!

లైఫ్@360

● యోగా

మానసిక శక్తిని పెంచే శ్వాస

నాసిక రంధ్రాల ద్వారా శ్వాసను లోపలికి తీసుకుంటూ, తిరిగి వదులుతూ చేసే ప్రాణాయామ పద్ధతులలో ముఖ్యమైనవి నాలుగు ఉన్నాయి. వాటిలో..

కపాలభాతి: ఈ ప్రాణాయామంలో వేగంగా ఊపిరి తీసుకోవడం, వదలడం ఉంటుంది. ఈ విధానం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుంది. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది. శ్వాసకోశ కండరాలు బలోపేతం అవుతాయి. ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది. మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీని వల్ల చేసే పనిపైన శ్రద్ధ, సృజనాత్మకత పెరుగుతుంది. ఒక ప్రశాంతమైన స్థలంలో సుఖాసనంలో కూర్చొని, ముక్కు ద్వారా శ్వాస పీల్చుతూ, వదులుతూ ఉండాలి.



భస్త్రిక: ఈ ప్రాణాయామం ద్వారా శరీరంలో ఆక్సిజన్ స్థాయిని పెంచవచ్చు. నోటిద్వారా శ్వాసను తీసుకొని, నోటిద్వారా వదలాలి. ఈ ప్రక్రియను పది-పదిహేను సార్లు పదే పదే చేయాలి.

భ్రామరి: ఈ ప్రాణాయామం ద్వారా మనస్సు ప్రశాంతంగా మారుతుంది. నోటితో తేనెటీగ లాగ హమ్ చేస్తూ .. నాసిక రంధ్రాల ద్వారా గాలి పీల్చుకొని, నెమ్మదిగా వదలాలి.

ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వైద్యులను సంప్రదించి, నిపుణుల సలహాతో వీటిని సాధన చేయడం వల్ల మెరుగైన ఫలితాలను పొందుతారు.

సాక్షి సినిమా

ఆధ్యాత్మిక గురువు రవిశంకర్‌గా విక్రాంత్

● కొలంబియా అంతర్యుద్ధం ప్రధానాంశంగా 'వైట్'



● విక్రాంత్

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు రవిశంకర్ జీవితం వెండితెర పైకి రానుంది. రవిశంకర్ జీవితంతో సినిమా రానుందని ఎప్పట్నుంచో ఓ వార్త ప్రచారంలో ఉంది. బాలీవుడ్ దర్శక-నిర్మాతలు సిద్ధార్థ్ ఆనంద్, మహావీర్ జైన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు కూడా టాక్ వినిపించింది. ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రను విక్రాంత్ మాస్సీ చేయనున్నారనే ఊహాగానాలూ నెలకొన్నాయి. అందుకు తగ్గట్టు గత ఏడాది రవిశంకర్‌ని కలిశారు విక్రాంత్. ఆయన పాత్రలో ఒదిగిపోవడానికి కావాల్సిన సలహాలు, సూచనలు తీసుకున్నారట. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ని జూలైలో ఆరంభించాలనుకుంటున్నారన్నది తాజా సమాచారం. 'వైట్' టైటిల్‌తో రూపొందనున్న ఈ చిత్రానికి యాడ్ ఫిల్మ్ మేకర్ మాంటూ బస్సీ దర్శకత్వం వహించనున్నారు. కొలంబియాలో జరిగిన అంతర్యుద్ధాన్ని పరిష్కరించడంలో రవిశంకర్ ఏ విధంగా కీలక పాత్ర పోషించారనేది ఈ చిత్రం ప్రధానాంశమని సమాచారం. అంతర్జాతీయ స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో రవిశంకర్ పాత్రలో ఒదిగిపోవడానికి విక్రాంత్ మాస్సీ మేకోవర్ అవుతున్నారు. హిందీ, ఇంగ్లిష్, స్పానిష్ భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందించి, పలు భాషల్లో అనువదించి, రిలీజ్ చేయాలనుకుంటున్నారు. వచ్చే ఏడాది 'వైట్' విడుదల కానుంది.

వారం ముందుగానే...



● టామ్ క్రూజ్

హాలీవుడ్ సినిమాలకు ప్రపంచవ్యాప్తంగా ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అందులోనూ ఇండియాలో అద్భుతమైన ఆదరణ ఉంటుంది. తాజాగా భారతదేశంలో విడుదల కానున్న మరో క్రేజీ హాలీవుడ్ మూవీ 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్'. టామ్ క్రూజ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి క్రిస్టోఫర్ మెక్ క్వారీ దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఇండియాలో తెలుగు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో మే 23న విడుదల కావాల్సి ఉంది. అయితే వారం ముందుగానే మే 17న ఈ చిత్రాన్ని ఇండియాలో రిలీజ్ చేస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు మేకర్స్. ప్రపంచవ్యాప్తంగా విశేష ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న 'మిషన్ ఇంపాజిబుల్' ఫ్రాంచైజీలో భాగంగా ఎనిమిదో చిత్రంగా 'మిషన్ ఇంపాజిబుల్: ద ఫైనల్ రెకనింగ్' రూపొందింది.

తన కోసమే నా పొగరే అణిగేనా...



● నాని

నాని, శ్రీనిధీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వంలో 'హిట్' యూనివర్స్‌లో వస్తోన్న మూడో చిత్రమిది. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా మే 1న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. మిక్కీ జే మేయర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'తన కోసమే నా పొగరే...' అంటూ సాగే మూడో పాటని శుక్రవారం విడుదల చేశారు. రాఘవ్ సాహిత్యం అందించిన ఈ పాటని సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడటం విశేషం. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా, తన కోసమే నా పరుగే ఇక ఆగేనా...' అంటూ ఈ పాట సాగుతుంది. ''హిట్: ది థర్డ్ కేస్' సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన 'ప్రేమ వెల్లువ, అబ్ కీ బార్ అర్జున్ సర్కార్...' పాటలకు మంచి స్పందన వచ్చింది. 'తన కోసమే నా పొగరే మరి అణిగేనా...' పాట కూడా ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

హ్యాట్రిక్ హిట్ కావడం ఆనందంగా ఉంది

- ఇంద్రగంటి మోహనకృష్ణ



● రూప, ప్రియదర్శి, మోహనకృష్ణ, తనికెళ్ల భరణి, శివలెంక కృష్ణప్రసాద్

''శివలెంక కృష్ణప్రసాద్, నా కాంబినేషన్‌లో వచ్చిన 'జెంటిల్ మ్యాన్, సమ్మోహనం' చిత్రాలు హిట్ అయ్యాయి. మా కాంబోలో వచ్చిన మూడో చిత్రం 'సారంగపాణి జాతకం' హ్యాట్రిక్ హిట్ అయినందుకు హ్యాపీగా ఉంది. సినిమా బాగుందని ఎంతో మంది ఫోన్ చేస్తున్నారు... మెసేజ్‌లు చేస్తున్నారు. మా చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అని ఇంద్రగంటి మోహనకృష్ణ తెలిపారు. ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా రూపొందిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తోందని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ సెలబ్రేషన్స్‌లో ప్రియదర్శి మాట్లాడుతూ– ''ఈ రోజు మా టీమ్ గెలిచిందంటే నేనూ గెలిచాను. సినిమా గెలిచింది... మేం గెలిచాం'' అని చెప్పారు. ''మా సినిమా ప్రభంజనం ఇప్పుడే ప్రారంభం అయింది'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''చాలా రోజుల తర్వాత థియేటర్‌లో అందరూ పగలబడి నవ్వుతున్నారు. నవ్వులతో థియేటర్ దద్దరిల్లిపోతోంది'' అని తనికెళ్ల భరణి పేర్కొన్నారు. ఈ సెలబ్రేషన్స్‌లో నటులు అవసరాల శ్రీనివాస్, వడ్లమాని శ్రీనివాస్, కెమెరామేన్ పీజీ విందా, ఆర్ట్ డైరెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆ అనుబంధానికి పేరు పెట్టలేను!

- సమంత

''జీవితంలో మనం తీసుకునే ఒక నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకొని కెరీర్ ఎలా ఉంటుందో చెప్పలేం. ఒకవేళ ఎవరైనా అలా నిర్ణయిస్తే అది అబద్ధమే అవుతుంది. తెలిసీ తెలియక తీసుకున్న ఎన్నో నిర్ణయాలు కెరీర్‌పై ప్రభావం చూపుతాయి'' అని సమంత అన్నారు. తమిళ చిత్ర పరిశ్రమలో ఇటీవల నిర్వహించిన 'గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో' గోల్డెన్ క్వీన్ అవార్డు అందుకున్నారు సమంత. అనంతరం ఆమె తన కెరీర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''ఇంతమంది అభిమానులను సొంతం చేసుకోవడం నా అదృష్టంగా భావిస్తాను. నా అదృష్టంతో పాటు నేను పడిన కష్టమే ఈరోజు ఇంతమంది అభిమానం సంపాదించుకోవడానికి కారణం అయింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను'' అని చెప్పారు సమంత. ఇంకా తన వ్యక్తిగత జీవితం గురించి ఆమె మాట్లాడుతూ– ''నా ఆరోగ్యం బాగాలేనప్పుడు రాహుల్ రవీంద్రన్ (నటుడు, దర్శకుడు) ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాతోనే ఉంటూ జాగ్రత్తగా చూసుకున్నాడు. మా అనుబంధానికి పేరు పెట్టలేను. ఫ్రెండా? సోదరుడా? కుటుంబ సభ్యుడా? రక్త సంబంధీకుడా? అనేది చెప్పలేను'' అన్నారు. ఇక సమంత కెరీర్ విషయానికొస్తే... ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' అనే వెబ్ సిరీస్ చేస్తున్నారు. అలాగే తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం' మే 9న రిలీజ్ కానుంది.

మానవత్వం కరువైతే...



● శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్

''కలియుగమ్ 2064' సినిమా ట్రైలర్ ఆసక్తిగా ఉంది. ఫొటోగ్రఫీ, క్యారెక్టర్స్ డిజైన్, ఆర్టిస్టుల నటన... ఇలా అన్నీ ఒక మోడ్రన్ కైండ్ ఆఫ్ బుక్ చదివిన అనుభూతినిచ్చాయి. ఈ సినిమాని అందరూ థియేటర్లలో తప్పకుండా చూడండి'' అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన చిత్రం 'కలియుగమ్ 2064'. ప్రమోద్ సుందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కిశోర్ కీలక పాత్ర పోషించారు. కేఎస్ రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం మే 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగులో మైత్రీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ రిలీజ్ చేయనుంది. ఈ సినిమా ట్రైలర్‌ని రామ్‌గోపాల్ వర్మ విడుదల చేశారు. ''సైన్స్ ఫిక్షన్ అండ్ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. 2064లో ఆహారం, నీరు, మానవత్వం అనేవి కరువైనప్పుడు విచక్షణా జ్ఞానం కోల్పోయిన మనుషులు ఎలాంటి ఘోరాలకి పాల్పడ్డారు? అనే థీమ్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది.

ఓటీటీ ఇది చూడొచ్చు

అమెరికన్ ప్రెసిడెంటా... మజాకా...

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం జీ 20 ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

సినిమా దర్శకుని ఊహ అనేది ప్రేక్షకుల ఊహకందకపోతే అప్పుడు ఆ సినిమా పండుతుంది. ముఖ్యంగా హాలీవుడ్ దర్శకుల ఆలోచనలే వేరు. ఏది అసాధ్యమో, ఏదైతే జరగదు అని ప్రేక్షకులు అనుకుంటారో దాన్నే సినిమాలో చూపిస్తుంటారు హాలీవుడ్ డైరెక్టర్స్. హాలీవుడ్ దర్శకుడు పాట్రిసియా రీగెన్ తీసిన 'జీ 20' సినిమా ఆ కోవలోకి చెందినదే. ఒక్కసారి ఊహించండి... ప్రపంచంలోనే ఉత్తమోత్తమ సురక్షితమైన వ్యక్తి ఎవరైనా ఉన్నారు అంటే అది అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు అనే విషయం మనకు తెలుసు. మరి... ఆ అధ్యక్ష స్థానంలో ఉన్న వ్యక్తిని తన కుటుంబంతో పాటు బందీలుగా తీసుకుని ప్రపంచాన్ని శాసిద్దామనుకున్న విలన్‌ను అమెరికా ప్రెసిడెంట్ ఎలా ఎదుర్కొన్నారో ఈ 'జీ 20'లో చూడవచ్చు. అది కూడా అమెరికన్ ప్రెసిడెంట్‌ను, అతని కుటుంబాన్ని బందీలుగా చేసుకోవడం కూడా చిన్న వేదిక మీదైతే కాదు, దాదాపు అరడజను దేశాధినేతలతో పాటు జీ 20 శిఖరాగ్ర సమావేశంలో హై సెక్యూరిటీ నడుమ ఉండగా అమెరికన్ ప్రెసిడెంట్‌తో పాటు అక్కడున్న మిగతా దేశాధినేత లందరినీ బందీలుగా చేసుకుంటాడు విలన్. ఇక్కడ ఈ సినిమా దర్శకుడు ఇంకా వినూత్నంగా ఆలోచించాడు. బందీలుగా ఉన్న తన కుటుంబాన్ని, ఇతర దేశాధినేతలను కూడా విలన్‌తో పోరాడి విడిపించే బాధ్యత ప్రెసిడెంట్ మీదే పెట్టాడు సదరు సినిమా డైరెక్టర్. 'జీ 20' సినిమా మంచి ఉత్కంఠతతో ప్రారంభమై, ఆద్యంతం ప్రేక్షకుడిని ఉద్రూతలూగిస్తుంది. ముఖ్యంగా అమెరికన్ ప్రెసిడెంట్ పోరాట సన్నివేశాలు సినిమాకే హైలెట్ అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఈ సినిమాలో అమెరికన్ ప్రెసిడెంట్ కుంగ్ ఫూ ఫైటర్, గన్ షూటర్, అలాగే హెలికాప్టర్ రైడర్ కూడా. ఇక మరో పెద్ద ట్విస్ట్ ఏంటంటే సదరు అమెరికన్ ప్రెసిడెంట్ ఈ సినిమాలో ఓ లేడీ. ఈ పాత్రలో డేనియల్ సట్టన్ సూపర్‌గా నటించారు. పైన చెప్పుకున్నట్టు ఓ లేడీ అమెరికన్ ప్రెసిడెంట్ తన కుటుంబంతో పాటు ఇతర దేశాధినేతలను సూపర్ ఫైటింగ్ స్కిల్స్‌తో సేవ్ చేయడమనేది మామూలు కాన్సెప్టా... ఆలోచించండి. దటీజ్ 'జీ 20'. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా తెలుగు వెర్షన్ కూడా లభ్యమవుతోంది. అయితే మీ పిల్లలను ఈ సినిమాకి దూరంగా ఉంచి మీరు మాత్రం వాచ్ ఇట్ ఫర్ వీకెండ్



- హరికృష్ణ ఇంటూరు